# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

వెల : రూ. 10.00

అక్టోబర్ 2024



ఆషాఢ పౌర్ణమి నాడు శ్రీ సద్గురు పాదపూజ









జులై 29 మరియు 30, 2024 న తెనాలి నందు జరిగిన శ్రీశ్రీశ్రీ దండి నిర్మలానందగిరి స్వామి వారి ప్రధమ పుణ్యారాధన దృశ్యములు

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

డా॥ యమ్. స్వర్ణముఖి
సి.వి. రమణ బాబు
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ



సంపుటి 44 సంచిక 2
పేజీలు 44
అక్టోబర్ 2024

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ – 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో ............................. ....... పేజీ**


| | |
|---|---|
| దాశరథీ శతకము | 4 |
| శ్రీబాబూజీ ఉవాచ | 5 |
| అమ్మమాట | 7 |
| శ్రీపాద విచలిత క్షీరాంబు రాశి. | 10 |
| రాసేశ్వరి రాధాదేవి | 13 |
| భవత్కృపా రసము | 17 |
| భగవద్గీత సాధన దీపిక | 18 |
| వాల్మీకి | 21 |
| శ్రీ బాలగంగాధరనాథ స్వామి | 25 |
| నారద భక్తి సూత్రములు | 27 |
| శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు | 29 |
| మనశ్శతకము | 30 |
| నిరీక్షణ | 31 |
| శ్రద్ధాంజలి | 33 |
| సుబోధ | 35 |
| శ్రీ గురుగీత | 36 |
| సమర్థ సద్గురునాథుని దివ్యచరిత్ర | 38 |
| విష్ణు కథలు | 40 |

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

51) సలలిత రామనామ జపసార మెఱుంగను గాశికాపురీ
నిలయుడగాను మీచరణ నీరజరేణు మహాప్రభావముం
దెలియనహల్యగాను జగతీవర నీదగు సత్యవాక్యముం
దలపగ రావణాసురుని తమ్ముడగాను భవద్విలాసముల్
దలచినుతింప నాతరమె దాశరథీ కరుణాపయోనిధీ!



భావం - నీ లీలలు స్మరించి పొగడుట నా వశము కాదు. లలితమైన రామనామ జప సారాన్ని తెలియడానికి నేను కాశీపురమున నివసించు శివుడిని కాను. నీ పాదధూళి మహత్యము తెలుపగల అహల్యను కాను, నీ సత్యవాక్పరిపాలనను మాటిమాటికీ తలచుకోగల విభీషణుడను కాను. అయిననూ దయాశరథివైన నీవు నన్ను కాపాడుట నీకు ధర్మమే.

*క్షత్రియ, బ్రాహ్మణ లక్షణములు గల మహర్షి ఎవరు?
*మానవుని సిద్ధస్థితిలో కూడా కొనసాగే విధులేవి?
*గురుదేవులు తనను బ్రతికించబోయినా నిరాకరించి ఉత్తమ లోకాలకు ప్రయాణమైనదెవరు?
*పాండవులు చేసిన శంఖధ్వానాలు కౌరవులకు హృదయ భేద్యములుగా ఎందుకున్నాయి?
*శ్రీమాతాజీ వారి సహస్రనామాలను, అష్టోత్తర శతనామాలను రచించినదెవరు?
*సన్న్యాసిచే చెడుపని కోసం పంపబడిన మహిళ మనస్సు ఎలా మారిపోయింది?
*లక్ష్మీదేవిని చంచల, చపల అని ఎందుకు పిలుస్తారు?
*జంతువు పుట్టగానే ఏమంటుంది? మరణించాక దాని చర్మంతో చేసిన వాయిద్యం ఏమంటుంది?
*భగవానుడు చూపిన రెండిటిలో బ్రహ్మాన్ని ఎంచుకున్నదెవరు? తుప్పను ఎంచుకున్నదెవరు?

*సమాధానాలు లోపలి పేజీలలో.............................*

## శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

23-1-1981

ఈరోజు రాత్రి శ్రీబాబూజీ భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులకు వుద్బోధిస్తూ "నీళ్ళలో మునిగిన మానవుడు బయటకు రావటానికి ఏ రకంగా తపన చెందుతాడో అదే విధంగా ప్రతి మానవుడు భగవానుని చేరటానికి తపన చెందాలి. అటువంటి తీవ్రమైన తపన ద్వారా విశ్వాసము పెరుగుతుంది. ప్రగాఢమైన విశ్వాసమే భక్తిని కల్గజేస్తుంది. జ్ఞానమే మోక్షానికి దారితీస్తుంది. అయితే మనస్సు అట్టి స్థితిని పొందగలుగుతుందా? మనస్సు కామినీ కాంచనాలను ప్రేమించినంతగా భగవంతుని ప్రేమిస్తే ఇంక కావలసినది ఏముంది? మనస్సు మన శరీరం అంతా వ్యాప్తమై వుంటుంది. అదే అహంకారం. అది పోవటం కష్టం. అహంకారం నశించాలి.



మానవుడు అనుక్షణం 'నేను' 'నేను' అని విర్రవీగుతుంటాడు. అదే అహంకారం. ఆఖరికి జంతువు కూడా జన్మించగానే 'హంహై' 'హంహై' అంటుంది. అంటే నేను ఉన్నాను అని. ఆ జంతువు చనిపోయిన తర్వాత దాని చర్మముతో వాయిద్యాలు తయారు చేస్తారు. కాని ఆ వాయిద్యం మాత్రం మ్రోగించగానే తుమ్‌హై తుమ్‌హై అని మ్రోగుతుంది. నీవున్నావు నీవున్నావు అంటుంది. జంతువు యొక్క నరాన్ని దూది ఏకటానికి ఉపయోగిస్తారు. అప్పుడు ఆ నరము యొక్క శబ్దము కూడా అలానే ఉంటుంది. అలాగే ప్రతి మానవుడు అహాన్ని విడిచి భగవానుని నమ్మాలి, విశ్వసించాలి. నేను ఉన్నాను అనే అహంకారం పోయి నువ్వు ఉన్నావు అనే దృష్టి కలగాలి" అన్నారు.

ఇంతలో దాస్ అనే భక్తుడు “మానవుడు ఎలా తపన చెందితే భగవత్ సాక్షాత్కారాన్ని పొందుతాడు?” అని ప్రశ్నించాడు. బాబు మాట్లాడుతూ

"ఇప్పుడు నువ్వు గాఢ సుషుప్తిలో ఉన్నావు. దానినుంచి మేల్కొంటే అన్నీ తెలుస్తాయి" అన్నారు. ఆ ప్రక్కనే కూర్చుని వున్న రాజుగారి అబ్బాయి మెడ ప్రక్కన గట్టిగా పట్టుకుని "ఏరా భగవంతుడు ఉన్నాడంటే నేను నమ్మను వుంటే చూపించు అని మీ నాన్నతో ఛాలెంజి చేస్తున్నావటగా?" అనేసరికి వాడు "అమ్మోయ్, బాబోయ్ వదలండి వదలండి" అని గావుకేకలు పెట్టాడు. శ్రీబాబు మాట్లాడుతూ "నొప్పిగా ఉందా? ఏది ఆనొప్పిని చూపించు. నాకు ఏమీ కనపడటం లేదే" అని అన్నారు. 'వదిలిపెట్టండి బాబు' అని ఏడ్వటం మొదలుపెట్టాడు రాజుగారి అబ్బాయి. "చూశారా! ఈ క్షణంలో వీడు ఎలా ఆ పట్టు వదిలి పెట్టమని తపన చెందాడో భగవంతుని కోసం అలా తపన చెందాలి. అప్పుడే ఆ తేజోమూర్తిని దర్శించగల్గుతారు. ఏం దాస్! Understand?" అన్నారు శ్రీబాబు.

రాజుగారు అందరినీ నెట్టేసి ముందుకువచ్చి శ్రీబాబూజీకి నమస్కారం చేసుకుంటుండగా "ఏమండి అలా అందరిని త్రోసి పారేస్తారేమండి" అన్నారు శ్రీబాబు. రాజుగారు మాట్లాడుతూ 'వీళ్ళంతా ఎప్పుడూ ఇక్కడ ఉండేవాళ్ళే కదండీ! నేను ఇక్కడ ఉండనుకదండీ. అందుచేత మీ పాదసేవ చేసుకుందామని వచ్చాను' అన్నారు. శ్రీబాబు మాట్లాడుతూ "ఏమిటి వీళ్ళంతా ఉండేవాళ్ళు, మీరు వెళ్ళేవారా? ఏమిటండి అలా మాట్లాడుతారు. ఇంకా మీకు మనస్సు కుదరలేదు. కుదిరితే ఈ పాదము విడిచి వెళ్ళగలరా?" అని ప్రశ్నించారు.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ నివాసస్థులు అయిన శ్రీమతి బులుసు సీతామహాలక్ష్మిగారు 30-8-2024 శుక్రవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 100 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

## అశాంత మనసులకు ప్రశాంతి

శ్రీ బాబూజీ మహరాజ్‌వారు, తాపత్రయాగ్నులతో తపింప బడుచున్న మానవుల మనసులకి ప్రశాంతత లభించడానికి, అత్యంత అవసరమైనది 'సత్సంగము' అని నొక్కిచెప్పి, మనకీ సత్సంగ సమావేశములను ప్రసాదించారు. మనమెన్ని తీర్థయాత్రలు చేసి, ఎన్నిక్షేత్రాలు దర్శించినా క్షేత్రజ్ఞుడిని తెలుసుకున్న నాడే మనకి ఆ యాత్రల ఫలితం దక్కుతుంది. 'క్షేత్రాలు వేరయినా, క్షేత్రజ్ఞుడు మట్టుకు ఒక్కడేనని తెలుసు కోండిరా' అని చెప్పేవారు శ్రీ బాబూజీ మహరాజ్.



ఇటువంటి సూక్ష్మమైన విషయాలని తెలిపేటివాడు సద్గురుమూర్తి. అట్టి సద్గురుమూర్తిని ఆశ్రయించి, సేవించి, ఆయన చెప్పినట్టు ఆచరించనాడు ఆ 'అమ్మ' తత్వం మనకి అర్థమవుతుంది. రాముడు, కృష్ణుడు, శివుడు వీరందరూ, మన పెద్దలు చెప్తేనో, లేక క్యాలండర్లు చూస్తేనో మనకి తెలిసింది. కానీ, ఆ విగ్రహంలో వుండే మూర్తిని, సజీవమూర్తిగా మనకి దర్శింపజేసి, చివరకి ఆ రూపం నీలోనే, నీవుగానే ప్రకాశిస్తూ, అంతటా ప్రకాశిస్తోందిరా అని మనకి తెలిపేటివాడు గురుమూర్తి. అటువంటి జ్ఞానులు నిరహంకారులు. నిజమైన బ్రహ్మజ్ఞాని, 'నేను జ్ఞానిని' అని ఎప్పుడూ చెప్పకోడు.

అర్జునుడు అటువంటి నిరహంకారి కనుకనే ఆ గీతాచార్యుడి పరిపూర్ణ అనుగ్రహానికి పాత్రుడయ్యాడు. కురుక్షేత్ర సంగ్రామానికి ముందు శ్రీకృష్ణుని సహాయం కోరడానికి అర్జునుడు, దుర్యోధనుడూ కూడా వెళ్ళారు. కానీ వారిరువురి మనః ప్రవృత్తులలోనూ సహస్రం తేడా వున్నది! అహంకారంతో మ్రగ్గిపోతున్న దుర్యోధనుడి మనస్సుకి దుఃఖము, అశాంతే. భక్తి భావంతో పులకరిస్తున్న అర్జునుని హృదయం ఆ వాసుదేవుని చరణారవిందములయందే లయించిపోయి హాయిగా ఆనందంలో

మునిగిపోయింది! చివరకి ఎవరికేది కావాలో కోరుకోమని భగవానుడు అడిగినప్పుడు, 'ఏ ఆయుధం పట్టకపోయినా, నువ్వొక్కడివే మాకు చాలు కృష్ణా' అని, అసలయిన బ్రహ్మ పదార్థాన్ని అర్జునుడు కోరుకున్నాడు. కామక్రోధాది గుణాలతోనూ, ఈర్ష్యాసూయలతోనూ కుతకుతలాడిపోతున్న దుర్యోధనుడు 'హమ్మయ్య!' అని ఊపిరి పీల్చుకుని, తుప్ప, దూగర, పొల్లు లాంటి నారాయణీ సేనను ఎన్నుకున్నాడు! పరబ్రహ్మమునొక్కడినే ఆశ్రయించిన విజయుడికి విజయమే లభ్యమయింది. అనిత్యమైన లోకాన్ని ఆశించిన దుర్యోధనుడికి దుఃఖమే మిగిలింది. అలాగే, భగవంతుడినొక్కడినే ఆశ్రయించిన జీవులకి ఆనందమే వారి సొత్తవుతుంది. అనిత్యమైన జగత్తునాశ్రయించి, గుణాలకి దాసులయిన వారికి దుఃఖమే మిగులుతుంది. భగవంతుడు తనని నమ్ముకున్న వారికి ఎన్నో కష్టాలు పెడతాడు. కానీ నిజమైన భక్తుడు, తితీక్షతో వాటినన్నింటిని సహించి తన గమ్యాన్ని చేరుకుంటాడు. ఏసుక్రీస్తు చివరకి తనని శిలువ వేస్తున్నప్పుడు కూడా చలించలేదు. ఆయన, "ప్రభూ! నా తండ్రీ! ఎన్ని కష్టాలు వచ్చినా, యీ మాత్రం నిలబెడుతున్నావా స్వామీ! నువ్వు నాకున్నావు. అదే చాలు" అని అన్నారు.

"కాళీవనం" (కాళీగార్డెన్స్) అనే పేరుతో ఆశ్రమం స్థాపించి, బృందావనాధీశులై, పూర్ణచంద్రునిలా ప్రకాశిస్తున్నారు సద్గురుదేవులయిన శ్రీ బాబూజీ. 'కాళీ' అంటే 'నలుపు.' అజ్ఞానంతో కూడుకున్న మన మనస్సులే 'కాళీవనం.' అందులో గురుదేవులని నింపుకుంటే విషయాదులతో, త్రిగుణాలతో నల్లగా వున్న మన మనస్సులలోని అజ్ఞానాంధకారాన్ని పారద్రోలి, జ్ఞాన కాంతులతో నింపివేస్తారు వారు. మన మనస్సులలోని మాలిన్యాన్నంతా, నిరంతర భగవన్నామస్మరణతోను, సత్సాంగత్యముతోను, సద్వస్తు విచారణతోను క్షాళన చేసుకుంటే మనలోనే వున్న 'ఆత్మజ్యోతి' దర్శనం మనకవుతుంది.

సద్గురుమూర్తినాశ్రయించి, దాసోహమంటే, ఆయన ప్రసాదించిన లక్ష్యార్థ ధ్యానం ద్వారా మనలోని అజ్ఞానమనే చీకటి హరిస్తుంది. గురుదేవుని సాటి వేరే దైవం లేడని అప్పుడే మనకి అనుభూతమౌతుంది. అనుక్షణం, మనస్సనే మాయ, మనని పడగొట్టాలని పొంచి చూస్తూ వుంటుంది. కానీ గురుమూర్తి ప్రసాదించిన లక్ష్యార్థముని

(భగవన్నామమును) నిరంతరం స్మరిస్తే మాయ మన దరికి రాదు. అట్టి గురుకృపకి సర్వులూ పాత్రులగుదురు గాక! అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**అక్టోబర్ 2024**

3 గురు: శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం

10 గురు: దుర్గాష్టమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

11 శుక్ర: మహర్నవమి, - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

12 శని: విజయదశమి - ఉ.11.00 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

17 గురు: ఆశ్వయుజ పూర్ణిమ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

26 శని : శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

31 గురు: నరకచతుర్దశి, దీపావళి పండుగ - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**నవంబర్ 2024**

3 మంగళ: నాగుల చవితి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

12 మంగళ: చిలుక ఏకాదశి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

13 బుధ: క్షీరాబ్ధి ద్వాదశి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

15 శుక్ర: కార్తీక పూర్ణిమ - సా.5.30 గం.లకు. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

18 సోమ: శ్రీ సద్గురు దేవుల పుణ్యారాధన ఉత్సవములు ప్రారంభం.

25 సోమ: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

# శ్రీపాద విచలిత క్షీరాంబు రాశి

- పాలూరి కాళీప్రసాద్

సప్తపది సినిమాలో ముగురమ్మలను కీర్తిస్తూ వేటూరి వారు వ్రాసిన అఖిలాండేశ్వరి పాటలో లక్ష్మీదేవిని వర్ణిస్తూ **శ్రీపాద విచలిత క్షీరాంబు రాశి** అంటారు. అమ్మ పాదం తాకితే అంత ప్రశాంతంగా ఉండే క్షీరసాగరం అంతా అల్లకల్లోలమై ఉప్పొంగిపోతుందిట. అంతటి శక్తి స్వరూపిణి అమ్మ. ఎంతటి మహాశక్తి తనకున్నా తన భర్త అయిన శ్రీహరి హృదయంలో ఒదిగిపోయి నిరంతరం ఆయన పాదసేవ చేస్తూ ఉంటుంది. అందుకే అమ్మ **శ్రీహరి ప్రణయాంబు రాశి.**

జగన్మాత ప్రకృతి స్వరూపిణి కదా. ప్రకృతిలోని పంచ మహాభూతాలలో ఏ ఒక్కటి తన పరిధిని దాటినా జరిగే విపత్కర పరిణామాలు మనం నిత్యం చూస్తూనే ఉన్నాం కదా! భూకంపాలు, వరదలు, సౌర తుఫానులు ఇలా ప్రకృతిలో ఏ చిన్న మార్పు సంభవించినా అది లక్షలాది మానవుల, ఇతర జీవరాశుల వినాశానికి దారి తీస్తుంది. పైకి ఎంతో శాంతంగా కనిపించినా ప్రకృతి నిరంతరం మార్పు చెందుతూనే ఉంటుంది. అందుకే అమ్మ నామాలలో చంచల, చపల వంటి నామాలు ఉంటాయి. అయితే స్థితి కారకుడైన శ్రీహరి తన అవ్యాజమైన ప్రేమతో అనంతశక్తి సంపన్నురాలైన ప్రకృతిమాతను అదుపులో పెడుతూ మహాప్రళయం రాకుండా కాపాడుతూ ఉంటాడు. అందుకే అమ్మ ఇక్కడ **శ్రీహరి ప్రణయాంబు రాశి.**

మరో కోణంలో ఆలోచిస్తే లక్ష్మీదేవి **క్షీరసముద్రరాజ తనయ.** సాధారణంగా మన ఇళ్లలో ఆడపిల్ల పుడితే మహాలక్ష్మి పుట్టింది అంటారు. అటువంటి ముద్దులొలికే పసిపాప కొంచెం పెద్దదై, తండ్రి ఆ పాపను తన రెండు చేతులతో ఎత్తుకొంటే, తన లేలేత పాదాలతో ఆ తండ్రి గుండెలపై బుడిబుడి అడుగులు వేస్తూ ఉంటే ఆ తండ్రి హృదయం ఎంతగా పులకించి పొంగిపోతుంది? అటువంటిది మరి సాక్షాత్తూ మహాలక్ష్మీ దేవియే తన కుమార్తెయై, తన ఇంటనే కాపురం పెట్టి తన గుండెలపై మృదువుగా అడుగులు వేస్తూ ఉంటే ఆ తండ్రి హృదయం ఎంతగా వుప్పొంగిపోతుంది? అందుకే ఆ తల్లి **శ్రీపాద విచలిత క్షీరాంబు రాశి.**

పేదరికంలోనో, దిగువ మధ్యతరగతిలోనో జీవనం గడిపే అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు ఒకే చోట కలిసిమెలిసి నివసిస్తూ ఎంతో అన్యోన్యంగా ఉంటారు. వారిల్లు క్షీరసాగరం లాగే ప్రశాంతంగా ఉంటుంది. ఒక్కసారి అనుకోకుండా వారింట్లో **సలలితముగ నారికేళ సలిలము భంగి** సిరి ప్రవేశించిందంటే ఇక ఎక్కడలేని గొడవలు మొదలవుతాయి. ఆ సంసారం అల్లకల్లోలం అయిపోతుంది. అప్పటిదాకా కలసిమెలసి వున్నవారు వేరు కాపురాలు పెడతారు. ఉన్న కాస్త పదార్థాన్ని పంచుకు తిన్నవారు ఇప్పుడు సంపదలో వాటాలకు కొట్టుకు చస్తారు. అందుకే సిరి **శ్రీపాద విచలిత క్షీరాంబు రాశి.**

The gods must be crazy అనే ఆంగ్ల చిత్రంలో నాగరిక వాసన అంటని ఒక అమాయకపు తెగ అడవులలో నివసిస్తూ ఉంటుంది. అందరూ కలసి ఆహారాన్ని సంపాదించుకుంటూ, దొరికిన దానిని పంచుకొని తింటూ వుంటారు. ఒకనాడు పైనుంచి విమానంలో వెళు తున్న వ్యక్తి ఒక గాజు సీసాను వీరు నివసించే ప్రదేశంలో పడవేస్తాడు. అది మనకు దేవుడే ఇచ్చాడని నమ్మిన ఆ తెగ ప్రజలు, దానిని అనేక రకాలుగా ఉపయోగించడానికి ప్రయత్నిస్తూ ఆ అపురూపమైన వస్తువు నాకు కావాలంటే నాకు కావాలని కొట్టుకుంటూ ఉంటారు. ప్రశాంతమైన తమ జీవనంలో అల్లకల్లోలం సృష్టిస్తున్న ఈ కానుక మాకొద్దు అని నిర్ణయించుకొని అందులో ఒకడు భూమి చివరి అంచుకు చేరుకొని దీనిని మళ్ళీ ఆ దేవుళ్ళకే తిరిగి ఇచ్చేద్దామని బయలుదేరుతాడు. హృదయంలో శ్రీహరిని నింపుకోకుండా కేవలం లక్ష్మీ అనుగ్రహాన్ని మాత్రమే పొందితే జీవితం ఇలాగే అల్లకల్లోలమైపోతుంది. **శ్రీహరి ప్రణయాంబు రాశి** గానే అమ్మను గ్రహిస్తే వారిద్దరూ కొలువైన మన హృదయం పాలసముద్రంలాగే స్వచ్ఛంగా ఉండి జీవితం ప్రశాంతంగా గడుస్తుంది.

మానవుడు పుట్టినపుడు అతని మనస్సు క్షీరసాగరంలా స్వచ్ఛంగానే ఉంటుంది. నిరంతరం తనలో తాను రమిస్తూ చిరునవ్వులు చిందిస్తూ ఉంటాడు. అయితే అటువంటి శిశువుకు మెల్లగా తల్లి దండ్రులూ బంధువులూ ఒక పేరును ఆపాదించి, ఒక్కొక్క వస్తువునూ

బొమ్మనూ 'ఇది నీది, ఇది నీది' అని ప్రేరేపిస్తూ ఉంటారు. ముందు పెద్దగా పట్టించుకోడు. తన చేతిలో ఉన్నదేదైనా ఎవరడిగినా ఇచ్చేస్తూ ఉంటాడు. అయితే మెల్లమెల్లగా ఈ వస్తువులతో సాన్నిహిత్యం పెరిగినకొద్దీ జగన్మాత మహామాయా స్వరూపిణియై ఆ పసివానిలో ఆ వస్తువులపట్ల సంగాన్ని పెంపొందిస్తుంది. అప్పుడు ఇక అహంకార మమకారాలు, రాగద్వేషాలు, ఈర్ష్యాసూయలు ప్రవేశించి ప్రశాంతమైన ఆ మానవుని మనస్సుని అల్లకల్లోలం చేస్తాయి. **శ్రీపాద విచలిత క్షీరాంబు రాశి.**

అయితే బయటి విషయాలు తనను ఎంతగా ప్రభావితం చేయాలని చూసినా, తల్లి గర్భంలో తాను నిరంతరం అనుసంధానమై ఉన్న శ్రీహరిని మరువక చిత్తంలో నిలుపుకొంటే అప్పుడు **శ్రీహరి ప్రణయాంబు రాశి** అయిన అమ్మ అత్యంత పతిభక్తి కలది కాబట్టి ఆ మనస్సును విచలితం కాకుండా కాపాడి, పారమార్థికానికీ వ్యావహారికానికీ మధ్య ఊగిసలాడుతూ డోలాయమానమైన మనస్సుకు స్థిరత్వాన్ని ప్రసాదించి, ఆధ్యాత్మిక సాధనను వృద్ధి పరచి శ్రీపీఠమైన సహస్రారాన్ని చేరుకొనేలా సహకరిస్తుంది. అందుకే ఇక్కడ అమ్మ **శ్రీపీఠ సంవర్ధని, డోలాసుర మర్దిని.**

జగన్మాత లక్ష్మీదేవిని మనం కేవలం వరాలిచ్చే వరలక్ష్మిగానో, ధనాన్ని ఇచ్చే ధనలక్ష్మిగానో చూడకూడదు. ఆ తల్లి మనకు ఆధ్యాత్మిక సాధనకు కావలసిన తెలివిని ఇచ్చే విద్యాలక్ష్మి. సాధనలో ఎదురయ్యే ఎన్నో అడ్డంకులను దాటి ముందుకు వెళ్ళే ధైర్యాన్నిచ్చే ధైర్యలక్ష్మి. అంతశ్శత్రు సంహారం చేసే వీర్యలక్ష్మి. మన భక్తికి ఫలంగా జ్ఞానపుత్రుని ప్రసాదించే సంతానలక్ష్మి. సాధనలో విజయాన్ని చేకూర్చే విజయలక్ష్మి. మనకు ఆహారాన్ని అందించే ధాన్యలక్ష్మి. చివరికి మనను ఇహంలోనే పరమపదానికి చేర్చే మోక్షలక్ష్మి. అటువంటి అమ్మను మనసారా ధ్యానిస్తూ నిరంతరం లక్ష్మీనారాయణులను మన హృదయంలో నిలుపుకొంటే ఇక మనకు ఇహపరాలలో ఏ లోటూ ఉండదు.

# రాసేశ్వరి రాధాదేవి

- భాగవతుల జయప్రద

భాద్రపద శుక్ల (శుద్ధ) అష్టమి (రాధాష్టమి) రాధాదేవి జన్మదినం. హిందూ ధర్మంలోని తాత్త్విక దృష్టిలో ప్రేమ సర్వాంతర్యామిగా ఉంది. ఈ దివ్య ప్రేమయే విశ్వాన్ని నడిపిస్తూ, సర్వ సృష్టిని పోషిస్తోంది. రాధా దేవి, శ్రీకృష్ణుడి పట్ల తనకు ఉన్న పరమ భక్తితో, ఆ దివ్య ప్రేమకు ప్రతీకగా నిలుస్తుంది. ఆమె ప్రతిఫలరహిత ఆధ్యాత్మిక మూలాన్ని వ్యక్తీకరిస్తుంది.

శైవ సంప్రదాయంలో శివ శక్తులుగా ఉన్నట్లు, వైష్ణవ సంప్రదాయంలో శ్రీకృష్ణుడు మరియు రాధా దేవి విశ్వాన్ని నడిపించే ప్రధాన శక్తులుగా భావించబడతారు. శ్రీకృష్ణుడు పరమ సత్యానికి రూపకంగా ఉండగా, రాధా దేవి ఆయన స్త్రీ స్వరూపంగా పరిగణించబడతారు.

హిందూ ధర్మంలో పురుష మరియు స్త్రీ శక్తులు విశ్వానికి ఆకారం మరియు అర్థాన్ని ఇవ్వడంలో సమానంగా ముఖ్యమని విశ్వసించబడింది. కాబట్టి శివ మరియు శక్తిలా, కృష్ణుడు మరియు రాధా కూడా దివ్య చైతన్యానికి పురుష మరియు స్త్రీ అంశాలుగా భావించబడతారు. రాధ మరియు కృష్ణుల దివ్య సాంగత్యం కాబట్టి అది విశ్వాతీత రాసలీలగా పరిగణించబడుతుంది. ఈ విశ్వాతీత రాసలీల ఆధ్యాత్మిక లోకానికి గూఢ రహస్యాలను అవిష్కరిస్తుంది, దివ్యతను అన్వేషించేటప్పుడు పరమ భక్తి యొక్క ప్రాధాన్యతను మనకు బోధిస్తుంది, తద్వారా మోక్షం లేదా విముక్తి దిశగా మార్గాన్ని చూపిస్తుంది. **"కృష్ణప్రాణాధికా దేవీ తధాధీనో విభుర్యతః। రాసేశ్వరీ తస్య నిత్యం తయాహీనో న తిష్ఠతి"** (శ్రీ దేవి భాగవతం) - శ్రీ రాధ ఈ కృష్ణుని ప్రాణ స్వరూపిణి. ఆమె కృష్ణుని అదుపులో ఉంచే అధిపతి. గోపాలుడి రాస లీలకు ఆమె స్వామి.

**"ప్రాపంచిక జీవనం రసోపాసనకు అడ్డంకి అవుతుందా?"**

సామాన్య జీవితం యొక్క అంశాలు దివ్య సేవ కోసం అద్భుతమైన పరికరాలుగా ఉపయోగించవచ్చు. ఇలాంటి జీవితం

మార్గాన్ని శ్రీ రాధా దేవి 'హరివంశా'కి బోధించింది. హరివంశా తల్లిదండ్రులు తన కుమారుడికి వివాహం చేయాలనుకున్నారు, ఏర్పాట్లు మొదలుపెట్టారు. కానీ అతను అపారమైన విషాదంలో మునిగిపోయాడు. "ప్రతి క్షణం నేను రాధా దేవి సమక్షంలో ఉన్నాను. నేను వివాహబంధంలో ఎలా ప్రవేశించగలను?" అని ఆలోచించేవాడు. ఈ విధంగా ఆలోచిస్తూ హరివంశా తన పూజామందిరంలో రాధ పాదాలపై పడిపోయాడు. అప్పుడు రాధా దేవి ఇలా అన్నది, "రసోపాసనలో లీనమైన ఒక జీవాత్మను తామరాకు పైన నీటి బొట్టు వలే భావించవచ్చు. దాని మీద నీరు ఉన్నా కూడా అది అంటుకోదు".

కొంతకాలం తరువాత హరివంశా అన్నపూర్ణ దేవిని వివాహం చేసుకున్నాడు. హరివంశా సేవాగ్రామంలో ఉండగా ఒక అద్భుతమైన సంఘటన జరిగింది. అతని ఇంటి దగ్గర ఒక సన్యాసి జీవిస్తూ వుండేవాడు. హరివంశా కీర్తి మరియు ప్రజాదరణ తెలుసుకుని అతను అసూయతో వ్యతిరేకంగా ప్రవర్తించాడు. అతను తన పొలాన్ని తానే తగులబెట్టుకుని హరివంశా తగులబెట్టాడు అని ప్రచారం చేశాడు. ఆ సంఘటన హోలీ పండుగ రోజున జరిగింది. ఆ రోజుననే ఆ తప్పుడు సన్యాసి ఒక అందమైన మహిళను హరివంశ ఇంటికి చెడుపని కోసం పంపాడు.(అతన్ని గ్రామం మరియు సమాజం నుండి బహిష్క రించడానికి). ఆ మహిళ అతని ఇంటికి చేరిన వెంటనే ఆశ్చర్యకరంగా, మలిన మనస్తత్వం వలన కాంతి మసకబడింది. ఆ ఇంటి పవిత్ర వాతావరణం ఆమె మనసును మార్చింది మరియు ఆమె అతని పాదాల ముందు వణుకుతూ నమస్కరించింది. ఆమె అతనికి అన్ని విషయాలను వివరించింది. గ్రామస్థులు కొంతకాలం తర్వాత ఆ తప్పుడు సన్యాసిని గ్రామం నుండి బహిష్కరించారు. హరివంశా దివ్యతను గుర్తించిన గ్రామస్థులు అతని సహచరులుగా మారారు.

అసలు భక్తులు (నిజ భక్త) రాధాకృష్ణ యొక్క రాసలీలలో నటులే! హరివంశా ఆధ్యాత్మిక జీవితం మరియు భక్తి, ప్రేమతో ప్రభావితమైన వ్రజవాసులు రాధావల్లభ సేవలో తమ భాగాన్ని ఇచ్చారు. కొందరు భూమి ఇచ్చారు మరియు మరికొందరు దేవత యొక్క నిత్య

సేవ కోసం అవసరమైన సామగ్రిని ఇచ్చారు. ఒక రోజు కొందరు వ్రజ వాసులు హరివంశా వద్దకు వచ్చి ఒక విల్లు మరియు బాణం తీసుకుని, “మహాత్మా, ఈ బాణం సాధ్యమైనంత దూరం పంపించండి. బాణం పడినంత వరకు ఉన్న భూమి మీదే.” అని కోరారు.

హరివంశా మదంతేరలో ఉండగా, హరిరామ వ్యాస అనే పండితుడు అనేక గ్రంథాలతో, ఆయనను ప్రశ్నించడానికి వచ్చాడు. అప్పుడు హరివంశా శ్రీ రాధా దేవి కోసం భోగాన్ని (నివేదన) తయారు చేయడంలో ఉండగా, హరిరామ వ్యాస ఆలోచనలు ప్రతిపాదించాడు. హరివంశా దయతో ఈ విధంగా ప్రతిస్పందించాడు, “పండిత్‌జీ, మీకు శ్రీ రాధాజీ గురించి తెలియదు. ఆమె సర్వేశ్వరీ (లోక పాలకురాలు). ఆమె కోసం భోగం తయారు చేస్తున్నప్పుడు, మనసు మరియు ఆత్మ, భక్తి భావంతో నిండి వుండాలి. అప్పుడు ఇతర విషయాల గురించి ఆలోచించడం ఎలా సాధ్యం? ఈ సంపూర్ణ ఆత్మార్పణమైన మాటలు హరిరామ గుండెల్లో మెరుపులా నాటాయి. వెంటనే అతను, ఆ గ్రంథాలను యమునలో విసిరివేసి, భక్తుడిగా మారాడు.

రసోపాసన అనేది భక్తి యోగంలోని ఒక వైవిధ్యం, ఇది ముఖ్యంగా రాధా-కృష్ణుల పట్ల ప్రేమ, భక్తి (ప్రేమ భక్తి) పై ఆధారపడినది. ఇది గాఢమైన భావోద్వేగాలతో కృష్ణుని లీలలు, స్వరూపం, మరియు దివ్య ప్రేమను ఆరాధించడం ద్వారా మనస్సును సంపూర్ణంగా భగవంతుని సేవలో నిమగ్నం చేసే విధానం. రసోపాసనలో ప్రధానంగా అనుసరించే కొన్ని పద్ధతులు: **లీలా చింతన** - రసోపాసనలో భక్తులు శ్రీకృష్ణుని లీలలను, ముఖ్యంగా రాధా-కృష్ణుల రాసలీలను చింతిస్తూ, మనస్సును ఆ ధ్యానంలో పూర్తిగా ఏకాగ్రపరుస్తారు. **మంత్రజపం** - కృష్ణుడి లేదా రాధారాణి యొక్క నామాలను జపించడం. ముఖ్యంగా రాధా-కృష్ణుల జంటతో సంబంధం కలిగి ఉన్న మంత్రాలను జపించడం ద్వారా రసోపాసన జరగుతుంది.

**సంగీతం మరియు నృత్యం** - సంగీతం, భజనలు, కీర్తనలు, మరియు కృష్ణుడికి సంబంధించిన నృత్యం ద్వారా రసోపాసనను అనుభవిస్తారు. ఇది భక్తుడిని స్వరూపానందంలో తేలుస్తుంది. **సేవ** (భాగవత సేవ) -

రాధా-కృష్ణుల విగ్రహానికి పూజలు చేయడం, భోగం సమర్పించడం, మరియు ఇతర విధాలుగా భగవంతుని సేవ చేయడం. **సత్సంగం** - రసోపాసనలో ఉన్న ఇతర భక్తులతో కలిసి సత్సంగము చేయడము **ఆత్మార్పణ** (మానస సేవ) - భగవంతునికి మనసులోని భావాలను అర్పించడం, అంటే అహంకారాన్ని విడిచిపెట్టి పూర్తిగా దివ్య ప్రేమలో లీనమవడం.

అమ్మ (రాధా దేవి ) ప్రేమ స్వరూపిణి ,అత్యంత కారుణ్య మూర్తి. ఆ దివ్య మూర్తి యొక్క జన్మదినమే భాద్రపద శుక్ల(శుద్ధ)అష్టమి.

### *పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు*

**** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును****

**అక్టోబర్ 2024**

3 గురు: శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం

9 బుధ: మూలా నక్షత్రం - సరస్వతీ పూజ

10 గురు: దుర్గాష్టమి - కుంకుమ పూజ

11 శుక్ర: మహర్నవమి, - కుంకుమ పూజ

12 శని: విజయదశమి - కుంకుమ పూజ

17 గురు: ఆశ్వయుజ పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ

26 శని : శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ.

31 గురు: నరకచతుర్దశి, దీపావళి పండుగ - శ్రీ సద్గురు పాదపూజ.

**నవంబర్ 2024**

15 శుక్ర: కార్తీక(గురు) పూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

18 సోమ: శ్రీ సద్గురు దేవుల పుణ్యారాధన ఉత్సవములు ప్రారంభం.

25 సోమ: శ్రీ గురుదశమి - శ్రీ గురుదేవుల వార్షిక పుణ్యారాధన. శ్రీ సద్గురు పాదపూజ. సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

# భవత్కృపా రసము

- పెనుమాక నాగేశ్వరరావు

భవత్కృపా రసము...
అరయన్ శంతను పుత్రుపై, విదురుపై, నక్రూరు పై, కుబ్జపై, నరుపై,
ద్రౌపదిపై, కుచేలుని పయిన్, నందవ్రజ శ్రేణిపై,

కందర్ప పరశురామయ్యపై, వడాలి పిన్నిపై,
మావులేటి చిరంజీవిరాజుపై, రాఘవమ్మపై, అమ్మడుపై,
కొండా వారి కుటుంబమ్ముపై, మేడ బాబుపై, పాండుగారి పరివారమ్ముపై,
శ్రీహరిపై, విశ్వనాధునిపై, లలితానందుల వారిపై, ఇందిరమ్మపై,

కోటిపల్లి మామ్మపై, భీమవరం తాతయ్యపై, బళ్ళారి శాస్త్రిపై,
బొంబాయి శాస్త్రిపై, తారకపరబ్రహ్మపై, లాలుపై, భోగరాజు వారిపై,
విజయేశ్వరానంద ప్రసాదులపై, కమలత్త పై, కామేశ్వరిపై,
రమణబాబుపై, ప్రసాదరావుపై, తుని భక్తులపై, రత్నాలమ్మపై,

తుని లక్ష్మిపై, సుగుణ ప్రసాద మాతాజీపై, సుంకర వారిపై,
అహోబలరాజుపై, అస్సాం వారిపై, చలపతిపై, భగవాన్ దాసుపై,
స్వర్ణముఖిపై, కురిచేటి వారిపై, జయమ్మపై, మద్ది వారిపై, సాయిపై
ఈశ్వర రాజు వంశంబుపై, వారణాసి వారిపై, మరెందరెందరి పైనో

పరగన్ గల్గు భవత్కృపా రసము నా పై ఇంకొంత రానిమ్ము
నీ చరణాబ్జంబులే నమ్మినాను జగదీశా, కృష్ణా, భక్తప్రియా,
కాళీవనాధీశా, కరుణాజలధీ, కాళీప్రసాదా, కామిత ప్రదాతా!

***శ్రీ కాళీవనాశ్రమము వారి ఆహ్వానము***

శ్రీశైల శ్రీ భ్రమరాంబికా మల్లికార్జునస్వామి వారి క్షేత్రంలో 26-10-2024 నుండి 2-11-2024 వరకు సత్సంగ కార్యక్రమములు నిర్వహించ బడును. మరిన్ని వివరములకు కుమారస్వామి 9346535357/శ్రీరామ్ 9396535357 నంబరులలో సంప్రదించగలరు.

# భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

## ప్రథమోధ్యాయము - అర్జున విషాదయోగము

పితామహుడైన భీష్ముని రక్షణలో అనంతంగా కనబడుతున్న తన పదకొండు అక్షౌహిణుల సైన్యాన్ని, భీముడి చేత పరిరక్షింపబడుతున్న ఏడు అక్షౌహిణుల పాండవుల సైన్యాన్ని ద్రోణుడికి చూపిస్తూ ఇరుసైన్యాల సంఖ్యను, బలా బలాలను లెక్కించుకొని తనకు తాను ధైర్యం చెప్పుకుంటూ దుర్యోధనుడు చివరకు "ఏది ఎట్లా ఉన్నా, మీరందరు మీమీ స్థానాలలో అప్రమత్తులై ఉండి భీష్ముణ్ణి అన్ని విధాల కాపాడండి" అని అన్నాడు. ఇది కూడ దుర్యోధనుడిలో చెలరేగుతున్న భయాందోళనలకు చిహ్నమే. దానికి కారణం లేకపోలేదు.



కౌరవ సైన్యాధిపతి అయిన భీష్ముడు, తన శపథం మూలంగా యుద్ధంలో తాను శిఖండి ముఖము చూడననీ, అందువలన శిఖండి మూలంగా తనకు అపాయం కలగని పక్షంలో, దుర్యోధనుడిని ఈ కురుపాండవ మహాసంగ్రామము అనే సముద్రాన్ని దాటిస్తాననీ అంతకు ముందే వాగ్దానం చేశాడు. భీష్ముని శౌర్య పరాక్రమాలు కురు సైన్యానికి అండగా ఉన్నంత వరకు పాండవులు తమను ఓడించలేరని దుర్యోధనుడి దృఢ విశ్వాసం. అందువలననే దుర్యోధనుడు, భీష్ముణ్ణి అన్ని విధాల కాపాడుకోవలసిందిగా ద్రోణాచార్యుడిని హెచ్చరించాడు.

ప్రపంచంలో అన్యాయం, అక్రమం వైపు చాలామంది నిలబడతారు. న్యాయం, సత్యం, ధర్మం పక్షాన కొద్దిమంది మాత్రమే నిలబడతారు. అయినా చివరకు న్యాయము, సత్యము, ధర్మము మాత్రమే జయిస్తాయి. కౌరవ, పాండవుల బలాబలాలు, ఆ మహాసంగ్రామం యొక్క ముగింపు, ఈ పరమ సత్యానికి ఉదాహరణ.

12. **తస్య సంజనయన్ హర్షం కురువృద్ధః పితామహః**
**సింహనాదం వినద్యోచ్చైః శ్శంఖం దధ్మౌ ప్రతాపవాన్ ॥**

అప్పుడు కురువృద్ధుడు, పితామహుడు అయిన భీష్ముడు, దుర్యోధనుడికి ధైర్యం గొలపటానికి, అతడికి సంతోషం కలిగించటానికి, సింహనాదం చేసి తన మహాశంఖాన్ని పూరించాడు. ఆ విధంగా కౌరవులు, అందునా భీష్ముడు యుద్ధాన్ని ప్రారంభించినట్లు అయింది. పాండవ సైన్యం యుద్ధం చేయటానికి సిద్ధంగా ఉన్నది. అంతేకాని యుద్ధం తాము ప్రారంభించాలి అనుకోవటం లేదు. అందువల్లనే వారు ముందుగా యుద్ధాన్ని ప్రారంభించే ప్రయత్నం ఏదీ చేయలేదు. ఆ విధంగా దుర్యోధనుడి పక్షమే ముందుగా యుద్ధం ప్రారంభించింది. దురభిమాని, యుద్ధోన్మాది అయిన దుర్యోధనుడు మొదటి నుండీ ఏదో ఒక నెపంతో యుద్ధం జరిగి తీరాలి అనే పట్టుదలతోనే ఉన్నాడు. కాని పాండవ సైన్యం అలా కాక యుద్ధానికి సిద్ధంగా ఉన్నా, యుద్ధాన్ని ప్రారంభించటానికి ఏ విధమైన ఆతృత పడటంలేదు.

13. **తత శ్శంఖాశ్చ భేర్యశ్చ పణవానక గోముఖాః**
**సహసై వాభ్య హన్యంత స శబ్దస్తుములోஉభవత్ ॥**

సంజయుడు ధృతరాష్ట్రుడికి కురుక్షేత్రంలో జరుగుతున్నది వర్ణిస్తూ "అలా భీష్ముడు తన శంఖాన్ని పూరించగానే కౌరవ సైన్యంలో నుంచి ఎన్నో శంఖాలు, భేరీలు, పణవానకాలు, గోముఖాలు మొదలైన వాద్యాలన్నీ కలసి ఒక్కసారిగా మ్రోగటం వినిపించింది. ఒక మహా రణగొణ ధ్వని బయలుదేరి దిక్కులన్నీ వ్యాపించింది" అని చెప్పాడు.

14. **తత శ్శ్వేతైర్హయైర్యుక్తే మహతి స్యందనే స్థితౌ**
**మాధవః పాండవాశ్చైవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః ॥**

15. **పాంచజన్యం హృషీకేశో దేవదత్తం ధనంజయః**
**పౌండ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః ॥**

16. **అనంత విజయం రాజా కుంతీపుత్రో యుధిష్ఠిరః**
**నకుల స్సహదేవశ్చ సుఘోష మణిపుష్పకౌ ॥**

17. **కాశ్యశ్చ పరమేష్వాస శ్శిఖండీచ మహారథః**
**ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకిశ్చాపరాజితః ॥**

**18. ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే !**
**సౌభద్రశ్చ మహాబాహుశ్శంఖాన్ దధ్ముః పృథక్పృథక్ ॥**
**19. స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్**
**నభశ్చ పృథివీం చైవ తుములోఽ వ్యనునాదయన్ ॥**

సంజయుడు 'ఓ ధృతరాష్ట్ర మహారాజా! అప్పుడు తెల్లని గుఱ్ఱములు పూన్చిన రథమును అధిరోహించి ఉన్న శ్రీకృష్ణ భగవానుడు పాంచజన్యాన్ని, ఆ వెనువెంటనే అర్జునుడు దేవదత్తమును పూరించారు. ఆ పైన వరుసగా భీముడు పౌండ్రమును, ధర్మరాజు అనంతవిజయాన్ని, నకుల సహదేవులు సుఘోష, మణిపుష్పకాలను పూరించారు. ఆ పిమ్మట కాశీరాజు, శిఖండి, ధృష్టద్యుమ్నుడు, విరాటుడు, సాత్యకి, ద్రుపదుడు, అభిమన్యుడు మొదలైన యోధులందరూ తమ తమ శంఖాలను పూరించారు.

ఆ విధంగా కేవలం సారథిగా ఉండటానికి మాత్రమే అంగీకరించి పార్థసారథిగా వచ్చిన శ్రీకృష్ణ భగవానుడే కౌరవుల శంఖధ్వనికి మొదట ప్రతి శంఖధ్వానం చేశాడు. ధర్మసంస్థాపన కోసం, సాధుజనులను రక్షించవలసి వచ్చినప్పుడు,దుష్టశక్తులను అణచి వేయవలసి వచ్చినప్పుడు, భగవంతుడే అందరికన్నా ముందు వుంటాడు.

యుద్ధాన్ని ధృతరాష్ట్రుడికి వర్ణిస్తున్న సంజయుడికి కూడ పాండవ సైన్యంలో ఎవరెవరు ఏయే శంఖాలను పూరిస్తున్నారో విస్పష్టంగా తెలుస్తున్నది. కౌరవ పక్షం వారి శంఖధ్వానములు అన్నీ కలసిపోయి అంతా గోలగా వినబడ్డాయి కాని, పాండవ సైన్యం చేసిన శంఖారావాలు మాత్రం సుస్పష్టంగా ఉండి ధార్తరాష్ట్రుల హృదయ భేద్యములై భూమ్యాకాశాలు నిండి ప్రతిధ్వనించాయి. ఈ ధ్వనులు కూడ కౌరవ సైన్యంలోని మనఃకల్లోలాన్ని, పాండవసైన్యంలోని ప్రశాంతతను, స్థైర్యాన్ని సంకేతిస్తున్నాయి. అంతేకాదు. పాండవులు చేసిన శంఖధ్వానాలు కౌరవులకు హృదయ భేద్యములుగా కావటానికి కారణం కౌరవుల హృదయాలలో తాము తప్పుచేశాము అన్న మనః ప్రవృత్తి ఉండటమే అని సూచింపబడింది.

- సశేషం


వాల్మీకి - 2
ముకుంద్
కొన్ని సంవత్సరాల తరువాత...
లే నాయనా! పుట్టలోనుంచి వచ్చినందుకు నీ పేరు వాల్మీకి అవుతుంది.
నా జన్మ ధన్యమయింది స్వామీ!


అయ్యో! చనిపోయిన పిల్లనుచూసి రెండవది కూడా చనిపోయిందే!


మానిషాద ప్రతిష్ఠాం త్వం
అగమః శాశ్వతీః సమాః।
యత్ క్రౌంచమిథునాదేకం
అవధీః కామమోహితః॥


ఆ? నా నోట్లోనుంచి
వచ్చిన
శబ్దాలేమిటి?


ఇది సృష్టిలోని మొదటి శ్లోకం, నాయనా!
7


వాల్మీకి అనే పేరుగల నీవు, ఆదికవివై శ్రీ రామచంద్రుని కథ అయిన రామాయణాన్ని రచించి, గొప్ప పేరును పొందుతావు!
8

# శ్రీ బాల గంగాధరనాథ స్వామి

సేకరణ - మురళీ

కర్ణాటక రాష్ట్రం, రామనగర జిల్లా, బనందూరు గ్రామంలో శ్రీ చిక్కలింగె గౌడ మరియు శ్రీమతి బోరమ్మ దంపతులకు 1945 వ సం. జనవరి 18న జన్మించారు శ్రీ గంగాధరయ్య. శ్రీ రామానందనాథ స్వామీజీ వద్ద 19 సం.ల వయస్సులో ఉపదేశం పొంది, శ్రీ బాలగంగాధరనాథ స్వామిగా నాథ పరంపరలోని శ్రీ ఆదిచుంచనగిరి మఠానికి 71వ పీఠాధిపతిగా 1974 వ.సం.లో బాధ్యతలు స్వీకరించారు. వారి బోధలు కొన్ని .....................

మనిషి జీవితంలో దైవప్రార్థన మరియు ఆరాధన ఎంతో అవసరం. నైతిక బలం అవసరమైనప్పుడు మరియు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందడం కోసం భగవంతుడికి తనను తాను అర్పించుకోవాలి. ఈ భౌతిక ప్రపంచంలో పునర్జన్మ వద్దని మరియు పరివర్తన యొక్క సుడిగుండంలో చిక్కుకోవద్దని భగవంతుడిని ప్రార్థించాలి. మనిషి చిన్నపిల్లాడిలా ఉండడం నేర్చుకోగలిగితే, ఆందోళనలు, చింతలు లేకుండా సంతోషకరమైన జీవితాన్ని గడపగలడు. పిల్లవాడు నిర్భయంగా, ఉల్లాసంగా ఉండగలడు, ఎందుకంటే అతనిని చూచుకోవటానికి తల్లి, లేక తండ్రి ఉంటారు. మనమందరం భగవంతుని పిల్లలం మరియు మనం కూడా నిర్భయంగా ఉండగలం. మన జీవిత ప్రయాణంలో మనకు సహాయం చేయడానికి, మార్గనిర్దేశం చేయడానికి మరియు ముందుకు నడిపించడానికి దేవుడు ఉన్నాడని గ్రహించడం నుండి ధైర్యం మరియు విశ్వాసం పుట్టాలి. సమస్యలు మరియు ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పుడు మనం ఒంటరిగా ఉండము.

మానవ శరీరాన్ని దేవాలయంతో పోల్చవచ్చు, దేవుడు లోపల కూర్చున్నాడు. కాబట్టి, మనం చేసేదంతా ఆయన ఆదేశానుసారం మరియు ఆయనను సంతోషపెట్టే పుణ్యకార్యాలను మాత్రమే మనం చేపట్టాలి. అందరితోనూ అత్యంత దయతో వ్యవహరించాలి. మనిషిగా పుట్టడం భగవంతుడు ప్రసాదించిన అరుదైన అదృష్టంగా భావించాలి, అందుకే అలాంటి సువర్ణావకాశాన్ని వృథా చేసుకోకూడదు. ప్రతి వ్యక్తి

తప్పనిసరిగా దైవంపై విశ్వాసం కలిగి ఉండాలి. తనను తాను తిరిగి కనుగొనాలి మరియు తనలోని ఉన్నతమైన, అద్భుతమైన సామర్థ్యాన్ని గురించి తెలుసుకోవాలి. దురదృష్టవశాత్తూ, మనిషి తనను తాను అహంతో గుర్తించి, స్వార్థం మరియు అన్ని చెడు పనులను చేస్తాడు. శ్రీకృష్ణుడు గీతలో "నేను అందరి హృదయాలలో కూర్చున్నాను" అని చెప్పాడు. మనిషి తన ఉన్నత స్వభావాన్ని గ్రహించగలిగితే మరియు అతనిలో దాగి ఉన్న అద్భుతమైన సామర్థ్యాన్ని ఉపయోగించుకోగలిగితే మాత్రమే శాంతి మరియు సంతోషకరమైన జీవితం ప్రతి ఒక్కరికీ లభిస్తుంది.

ఒక వ్యక్తి జీవితంలో ఆధ్యాత్మిక పురోగతిని సాధిస్తున్నప్పుడు, ప్రాపంచిక విషయాలపై ఆధారపడటం తెలివైన పని కాదని  తెలుసు కుంటాడు. ఎందుకంటే అవి శాశ్వతంగా ఉండవు. ఈ తరుణంలో, మనిషి 'అవినాశనమైన', సర్వశక్తిమంతుడి గురించి ఆలోచిస్తాడు మరియు అతని మార్గదర్శకత్వాన్ని కోరుకుంటాడు. అతను దేవుడిని ఆరాధించడం ప్రారంభిస్తాడు. అతను తన మానసిక సమస్యలన్నింటినీ వదిలించుకోవడానికి దేవుని నుండి నైతిక బలాన్ని పొందాలను కుంటున్నాడు. ప్రార్థనలు ఈ బలాన్ని అందిస్తాయి.

- సశేషం

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోనండి.

***అక్టోబర్2024 :*** AS *7197, 8389, 8391, 8396, 8425, 8426, 8427, 8443, 8446, 8940, 9135, 9138, 9255, 9259, 9260* PK *0037, 0038, 0040*

***నవంబర్2024 :*** AS 6975, 8470, 8472, 8476, 8479, 8481, 8483, 8626, 9176, 9261, 9263, PK 0042, 0043, 0045, 0047, 0050, 0051

# నారద భక్తి సూత్రములు

(గత సంచిక తరువాయి) - వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

భక్తి సూత్రము 13: **అన్యథా పాతిత్యయా శంకయా**

తాత్పర్యము: అలా కానిచో (ముందు సూత్రములలో చెప్పినట్లుగా జరగనిచో) పతనము సంభవించవచ్చు. 12వ భక్తి సూత్రములో చెప్పబడినట్లు దృఢనిశ్చయము కలిగిన సాధకుడితో శాస్త్రపరిరక్షణము జరగనిచో పతనం సంభవించవచ్చును అని ఈ సూత్రము తెలియచేస్తోంది. సాధకుడు శాస్త్రము యొక్క ఆదేశములను పాటించక వాటిలో నిషేధించబడిన కార్యములను ఆచరించినట్లయితే పతనము చెందుతాడని నారదులు ఈ సూత్రము ద్వారా హెచ్చరిస్తున్నారు. ఇదే విషయాన్ని గీతాచార్యులు భగవద్గీతలో ప్రస్తావిస్తూ "**యః శాస్త్రవిధి ముత్సృజ్య వర్తతే కామకారతః న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాం గతిమ్**" అంటూ "ఎవరైతే శాస్త్రములో చెప్పబడిన ఆదేశములను కాదని ప్రవర్తిస్తారో, వారు పరిపూర్ణ సిద్ధిని కానీ, సుఖాన్ని కానీ, చివరకి జీవిత పరమ లక్ష్యమును కానీ సాధించ లేర"ని వివరిస్తారు.



అయితే శాస్త్ర ఆదేశములను పుస్తక సంబంధమైన శాస్త్ర పరిజ్ఞానం వలె కాక గురుముఖతః వెలువడిన గురువాక్యములుగా పరిగణించాలి. అంటే గురు వాక్యమును ఆచరించని సాధకుడు సాధనలో అభివృద్ధి చెందడని దీని భావము. "**సంశయాత్మా వినశ్యతి**" అని జగద్గురువులు చెప్పినట్టు సాధనకు సంశయం చేటని, గురు వాక్యము మీద గురి లేని సాధకుడు సంశయము చేత పతనం చెందుతాడని ఈ సూత్రము ద్వారా గ్రహించవచ్చు.

దీని గురించి శ్రీ బాబుజీ మహారాజ్ వివరిస్తూ గాఢమైన విశ్వాసమే భక్తి అనీ విశ్వాసం లేని సాధకుడు ఎప్పటికీ సాధనలో వృద్ధి చెందడనీ తెలిపారు. అంతేగాక "నమ్మితే బంగారు పిచ్చుక, నమ్మకపోతే బూడిదే" అంటూ సాధనలో విశ్వాసము యొక్క ముఖ్యమైన పాత్రను శ్రీ బాబు బోధించారు.

కొన్ని గ్రంథాలలో ఈ సూత్రమును "**అన్యథా పావిత్ర్యయా శంకయా**" అని కూడా ప్రస్తావించారు. అంటే అలా (ముందు 12 వ సూత్రములో వివరించినట్టు) జరగకపోవడంతో భక్తి మార్గము యొక్క పవిత్రతకే భంగం కలుగుతుందని దీని అంతరార్థం. పవిత్రత అంటే చిత్తశుద్ధిగా సాధకులు అన్వయించుకోవాలి. చిత్తశుద్ధి లేనిదే సాధన పరిపూర్ణత చెందదని ఈ సూత్రము ద్వారా నారదులు తెలియజేస్తున్నారు.

భక్తి సూత్రము 14: **లోకోపి తావదేవ - కింతు భోజనాది వ్యాపారస్తు ఆ శరీరధారణావధి**
తాత్పర్యము: సాధారణమైన లౌకిక కర్మాచరణము (ఎంత అవసరమో) అంతవరకే. కానీ భోజనాది ఆవశ్యకమైన కార్యకలాపాలు శరీరం ఉన్నంతవరకు సాగుతూనే వుంటాయి. ఈ సూత్రం ద్వారా నారదులు సాధకుడికి ఉండవలసిన కార్యకలాపాలతో పాటు సిద్ధ స్థితిని పొందిన వారు శరీర ధర్మాలను ఏ విధంగా నిర్వర్తిస్తారో వివరిస్తున్నారు. "**తావదేవ**" అంటూ "అంతవరకే" అన్నది సాధకుడికి సాధనలో పనికివచ్చే ఒక మహా మంత్రము. ఏ పని అయినా సాధనకి అనుకూలమా? ప్రతికూలమా? అని సాధకుడు నిరంతరము పరీక్షించుకుంటూ హద్దు పెట్టుకోవాలని ఈ సూత్రము వివరిస్తుంది.

సాధారణ లౌకిక కర్మాచరణము ఎంత అవసరమో అంతవరకే వుండాలి. కానీ భోజనాది ఆవశ్యకమైన కార్యకలాపాలు మాత్రం శరీరం ఎంతవరకు ఉంటుందో అంతవరకూ కొనసాగుతాయి. సాధన జరుగుతున్న సమయంలోనే కాక సిద్ధ స్థితిని పొందిన తర్వాత కూడా సాధకుడు ఆహారాది విధులను కొనసాగిస్తూనే ఉంటాడు. "**శరీర మాద్యం ఖలు ధర్మసాధనం**" అని చెప్పబడినట్లు శరీర పోషణ కూడా సాధకుడికి ముఖ్యమే. ఎందుకంటే వారు ఉపాధిని భగవంతుడిని చేరడానికి ఒక మార్గముగా భావిస్తారు. అయితే భోజనాది ఆవశ్యకమైన కార్యకలాపాలను వారు మిత ప్రమాణములో తగు రీతిలో మాత్రమే ఆచరిస్తారు. దీని గురించి శ్రీ బాబూజీ మహారాజ్ వారు వివరిస్తూ సాధకుడికి మిత ఆహారము, మిత నిద్ర, మిత భాషణము అనే మూడూ మిత త్రయాలైన మిత్ర త్రయములు అని సెలవిచ్చారు. ఈ మిత్ర త్రయములు సాధకుడికి శమ దమాది ఇంద్రియ నిగ్రహములకు కూడా ఎంతో తోడ్పడతాయని శ్రీ బాబు బోధించారు. అంతే కాక శ్రీ బాబు "పెట్టింది తిను, చెప్పింది విను, చచ్చినట్టు పడి ఉండు" (అంటే నేను శరీరాన్ని అన్న మృత భావనను తొలగించుకొని అమృత భావనలో ఉండు) అని సెవిచ్చారు. ఇది ఒక మహామంత్రము వలె సాధకులైన మనందరికీ ఎంతో దోహద పడుతుంది.

అయితే ఆత్మారాములై నిత్య సమాధిలో ఉన్న సిద్ధులకు భోజనాది అవసరములను భగవంతుడే స్వయంగా పర్యవేక్షిస్తాడు. కానీ వారికి వాటిపై ఎంత మాత్రమూ ఆపేక్ష ఉండదు. ఆ స్థితిలో వున్నవారి యోగక్షేమములను నేనే వహిస్తానని గీతాచార్యులు చెప్పినది విదితమే కదా. ఈ సూత్రము ద్వారా సాధనలో అభివృద్ధి చెందడానికి ఏ విధమైన లౌకిక కార్యములను చేపట్టాలో అలాగే సాధకుడు నిత్య యుక్తుడై శరీర పోషణను ఎలా నిర్వర్తించాలో నారదులు తెలియజేస్తున్నారు.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

అక్టోబర్ 2024

2 బుధ: అమావాస్య

3 గురు: శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం – ఉ.8:19 గం. అంకురార్పణ.

9 బుధ: మూలా నక్షత్రం – సరస్వతీ పూజ

10 గురు: దుర్గాష్టమి

11 శుక్ర; మహర్నవమి, – సామూహిక కుంకుమ పూజలు

12 శని: విజయదశమి – సామూహిక కుంకుమ పూజలు

13 ఆది: ఏకాదశి – ఏకాహం, దీక్షావిరమణ, శ్రీ సద్గురు పాదపూజ.

17 గురు: ఆశ్వయుజ పూర్ణిమ – శ్రీ సద్గురు మండల దీక్ష ప్రారంభం. శ్రీ మాతాజీవారి జన్మదిన మహోత్సవం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

26 శని : శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

30 బుధ: మాసశివరాత్రి

31 గురు: నరకచతుర్దశి, దీపావళి పండుగ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

నవంబర్ 2024

1 శుక్ర; అమావాస్య – ఆకాశదీపం.

4 సోమ: నవంబరు 4 నుండి 12 వరకు శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి పంచామృతములు, నవరసములతో ఏకాదశ రుద్రాభిషేకములు, లక్ష బిల్వార్చన.

5 మంగళ: నాగుల చవితి

12 మంగళ: చిలుక ఏకాదశి – ఏకాహం, శ్రీ సద్గురు పాదపూజ, సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతములు, భక్త సమారాధన.

13 బుధ: క్షీరాబ్ది ద్వాదశి – శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

15 శుక్ర; కార్తీక(గురు) పూర్ణిమ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన. శ్రీ రామలింగేశ్వర స్వామి నగరోత్సవం.

18 సోమ: కార్తీక బహుళ తదియ – శ్రీ సద్గురుదేవుల 35వ వార్షిక పుణ్యారాధన ప్రారంభం. ఉ. 8:19 గం.లకు పూజ్య శ్రీ మాతాజీ వారిచే దీక్షా స్వీకరణము. రాత్రి 7:00 గం.లకు శ్రీ సద్గురుదేవుల పుణ్యారాధన.

25 సోమ: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురుదేవులకు మహాభిషేకము, శ్రీ సద్గురు పాదపూజ, దీపోత్సవం. శ్రీ గురుసాంప్రదాయములోని వారికి శ్రీ సద్గురు మహాపుణ్యారాధన.

26 మంగళ: శ్రీ సద్గురు దీక్షలో ఉన్నవారికి హోమం.

27 బుధ: హోమం పూర్ణాహుతి, దీక్షావిరమణ.

29 శుక్ర; మాసశివరాత్రి

# మనశ్శతకము

(గత సంచిక తరువాయి)

పరశురామపంతుల లింగమూర్తి కవి
(తాత్పర్యము: కుమారి సన్నిధానం కాళీమాత)

**73. నెట్టన నెక్కడ వెదకిన బుట్టని వస్తువును జూచి భోగింపు మికం**
**బుట్టని చావని గతి యీ పట్టున రాఘవు డొసంగు బళి యని మనసా.**

తాత్పర్యము: భౌతికముగా దృశ్యమానమైనట్టిగాక ఉండే వస్తువును అంత:కరణమునందు జూచి ఆత్మానందమును పొందిన, మళ్ళీ పుట్టుక చావు లేని స్థితిని రాఘవుడు నీకు కలుగజేయును భళీ అనుచు మనసా.

**74. లేనిది లేనే లేదని, లేనిది యుండగని కలది లేదని యేమిం**
**గానిది సర్వం బౌనని, యౌనని భద్రాద్రి రాము నరయుము మనసా.**

తాత్పర్యము: తనకు దృశ్యమానము కాలేదు కనుక అదిలేదు అనుకొనక, లేనిది అనుకున్నది ఉండటం చూడగలిగినప్పుడు ఏమీ కాదనుకున్నదే తనకు సర్వస్వం అవుతుందని ధృఢముగా నమ్మి భద్రాద్రి రాముని తెలియుము మనసా.

**75. కలిమియు లేమియు లేకం, గలకాలము లేక కలిగి కలిగియు లేకం**
**గల కలిమి లేమిగా గని, కలియుము శ్రీరామభద్రు గనుగొని మనసా.**

తాత్పర్యము: భౌతికమైన ఐశ్వర్యము ఉన్నప్పటికి అది కలిమి కాదని తెలిసికొని అటువంటి కలిమి ఉన్నను లేకపోయినను ఒకే రీతిగా భావించి శ్రీరామచంద్రుడే కలిమి అని తెలిసికొనుము మనసా.

**76. ఆకలిదప్పుల బొరయక, శోకము మోహంబు లేక సూడిద యై యే**
**లోకమున లేక వెలిగెడి యాకాశాతీతు రాము నరయుము మనసా.**

తాత్పర్యము: శోకము కలహము లేక ఆకలి దప్పుల బాధలు పడక ఆకాశముకంటే ఉన్నతుడైన శ్రీరాముని బొందుము మనసా.

- సశేషం

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

"రామా! వచ్చేశావా? నీదర్శనభాగ్యము కొరకు ఎంత కాలము నుండి తపస్సు చేస్తున్నానో?" అని శబరి ఆనందముతో తెలియజేసి వారికి ఉపచారములు చేసింది. ఆ వేటజాతి ముదుసలి సమర్పించిన స్వచ్ఛమైన ఫలములను రాముడు ఆరగించాడు. "అమ్మా! ముందు వెనుకలు తెలియని నన్ను చూడడానికి మీరు ఎందులకు నిరీక్షిస్తున్నారు?" "రామా! ఈ ఆశ్రమమందుండు మతంగమునికి చాలా కాలము వరకు సేవ చేసాను. ఆయనకు కావలసిన దుంపలు, కాయ గూరలు, పండ్లు, హోమమునకు అవసరమైన సమిధలు మున్నగు వాటన్నింటినీ ప్రతి దినమూ తీసుకురావడమే గాక, ఈ కుటీరమును శుభ్రపరచు పని కూడా చేయుచూ వచ్చాను. చదువుట, వ్రాయుట నాకు తెలియదు. ఆధ్యాత్మిక జ్ఞానము తెలియని నన్ను ఆ మునివర్యులు, నాకు దీక్షను ప్రసాదించి ఒక ఉన్నత స్థితికి తీసుకుని వచ్చారు.

ఒక దినమున ఆతడు, "శబరీ! నేను భగవంతుని చరణములు చేరుకొను సమయం ఆసన్నమైనది. ఇకపై నీవే ఈ ఆశ్రమమును నిర్వహించవలయును" అన్నారు. "నాకు కూడా ఆ భగవంతుని దివ్య చరణములుజేరు భాగ్యము ఇవ్వవచ్చుకదా!" అని ప్రశ్నించ ఆతడు నన్ను చూసి, "శబరీ! తప్పకుండా నీకు ఆ భాగ్యము కలుగుతుంది. దానికి నీకు రామదర్శనం ఆవశ్యకం. కావున రాముడు వచ్చేంత వరకు నిరీక్షించు" అని బదులిచ్చి తన యోగ మహిమచే ఆతను మోక్షం పొందారు. ఆ దినమునుండి నేను మీ కొరకు ఎదురుచూస్తున్నాను. ఈ కొండలందుండు మానవులు నన్ను పరిహాసం చేస్తున్నారు. వారిని లక్ష్యపెట్టకుండా మునివర్యుల ఆనతి మేరకు నేను ఒక్కొక్క సంవత్సరమూ నీ రాక కొరకు ఎదురుచూస్తూ కాలం వెళ్ళబుచ్చుతుంటిని, రామా!" అన్నది శబరి. రాముడుకూడ తనయొక్క గడచిన కాలమును గూర్చియు ఆమెకు తెలియజేసి, కబందుని సూచన మేరకు సుగ్రీవుని వెదకుచున్నానని తెలిపాడు. శబరి ప్రేమతో రాముని తలపై నిమిరి

ఆశీర్వదించింది. "సుగ్రీవునికి నీయొక్క స్నేహం లభ్యమగుట ఆతడు చేసుకున్న తఫోపలమే. ఆతని సహకారముతో నీవు నీ భార్యను పొందగలవనుట తథ్యము. కానీ ఆతడు ప్రస్తుతం నివసిస్తున్న ఋష్యమూక పర్వతమును చేరుకొనుట మిక్కిలి కష్టతరమైన కార్యము. దట్టమైన పొదలతో కూడిన ఆ కొండకు ఒక రాజుగ ఆతడు వెలుగొందు చున్నాడు. కలత చెందవలదు. నీకు సహాయపడ నిమిత్తమై ఒకవ్యక్తి అచ్చోట నీ కొరకు ఎదురు చూస్తున్నాడు. రామా! నీ కొరకు నిరీక్షించాను. నీ దర్శనభాగం లభ్యమైంది. నీ అనుమతితో నేను, నా స్వామి పాదముల చెంతకు పోవలయునని కోరుకొనుచున్నాను" అని చెప్పి శబరి తన యోగ మహిమచే అగ్నిని సృష్టించి, దానిలో కలసిపోయి మోక్షం పొందింది.

ఆ తరువాత రామ లక్ష్మణులు పంపాతీరము వెంబడి ధృడ నిశ్చయంతో కొండవైపుకు నడుచుకుంటూ వెళ్ళారు. ఆ మార్గములో కనబడిన కొందరిని దారి అడిగి తెలుసుకున్నారు. వారటు వెళ్ళుట బహు అపాయకర ప్రయత్నమని హెచ్చరించి, తప్పించుకున్నారు. సీతా వియోగముతో కూడిన బాధ చేతను, ఇప్పటి వరకూ జరిగిన సంఘటనల వలననూ అలసట చెందిన రాముని కాళ్ళు తడబడ్డాయి. చెంత సీత లేకపోవుటచే, పంపానది యొక్క ఇరు తీరములలో రాముడు గాంచిన ప్రకృతి దృశ్యములు ఆతని బాధను ఇంకాస్త అధికం చేసాయి. పొంగుచు వచ్చుచున్న తన కన్నీటిని అదుపు చేసుకొనుచు, లక్ష్మణుడు పలు విధములుగ అన్నగారిని వుత్సాహ పరచుచూ ఆతని వెంట నడిచాడు.

- సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ నివాసస్థులు అయిన కుమారి పావులూరి ఇందిరాదేవిగారు 9-9-2024 సోమవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 85 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

# శ్రద్ధాంజలి

- పాలూరి శివరామ కాళీప్రసాద్

ఆశ్రమవాసులందరూ ఇందిరక్క అని ప్రేమగా పిలుచుకొనే కుమారి పావులూరి ఇందిరాదేవి గారు సెప్టెంబర్ 9, 2024 నాడు గురుసాయుజ్యం పొందారు. శ్రీ బాబూజీ మహరాజ్ వారి భక్తులందరితో గురువుగారు అని పిలువబడే శ్రీ లలితానంద సరస్వతీ స్వామిని వారి కనిష్ట సోదరి, వారు శ్రీ గురుదేవుల వద్దకు రావడానికి కారణం ఇందిరక్కే. ఆవెంకు బ్రహ్మారాక్షసి ఆవహించడం, ఎన్ని వైద్యాలు, అనుష్ఠానాలు చేయించినా ఫలితం లేకపోవడంతో ఆ కుటుంబం శ్రీ బాబూజీ మహరాజ్ వారిని ఆశ్రయించడం జరిగింది.



ఆ బ్రహ్మారాక్షసి ఒక పీఠాధిపతి కావడంతో ఆ మిషతో ఇందిరక్కకు, శ్రీ బాబూజీ వారికి మధ్య ఎన్నెన్నో తత్వ విచారణలు జరుగుతూ ఉండేవి. శ్రీగురుదేవులను ఆశ్రయించిన తరువాత ఇందిరక్క, శ్రీ లలితానంద సరస్వతీ స్వామిని వారు ఎన్నెన్నో ఆధ్యాత్మిక అనుభవాలను పొందారు. శ్రీగురుదేవుల సర్వజ్ఞత్వ, సర్వవ్యాపకత్వ, సర్వేశ్వరత్వాలను ప్రత్యక్షంగా అనుభూతి చెందారు.

ఒక సందర్భంలో 'ఇందిరకు ఏమీ కాదు. నేను తిరిగి వచ్చేవరకు జాగ్రత్తగా చూసుకోండి' అని సెలవిచ్చి శ్రీగురుదేవులు గ్రామాంతరం వెళ్లారు. ఇంతలో ఇందిరక్క వ్యాధి తీవ్రమై తన పార్థివ దేహాన్ని విడిచిపెట్టి వైకుంఠానికి చేరుకున్నారు. అక్కడ ఇందిరారమణుని దర్శించుకొని వారిలోనే ఇందీవర శ్యాములైన గురుదేవులను దర్శించి వారి ఆదేశంతో ఈ భూమిమీద తాను చేయవలసిన కర్తవ్యాన్ని నిర్వర్తించడానికి తిరిగివచ్చి పునర్జీవితులయ్యారు.

మరొక సందర్భంలో తీవ్ర అస్వస్థతతో ఆమె కాలేజీకి వెళ్ళలేని పరిస్థితిలో శ్రీగురుదేవులే ఆమెలో ప్రవేశించి కాలేజీలో లెక్చరరుగా కొంతకాలం బాధ్యతలు నిర్వహించారు.

ఆమెను ఆవహించిన బ్రహ్మరాక్షసి కొంతకాలం శ్రీగురుదేవుల సన్నిధిలో గడపడం వలన తన కర్మశేషం తీరిపోవడంతో ఆమెను వదలి వెళ్ళిపోతూ, 'ఇందిరను నేను పీల్చి పిప్పి చేశాను. ఇప్పుడామె ఒక గాజు బొమ్మ కన్నా సున్నితమైనది. చాలా జాగ్రత్తగా చూసుకోండి. శ్రీ బాబూజీ పాదాలను మాత్రం ఎట్టి పరిస్థితులలో విడువకండి' అని వారి అక్కయ్యకు కర్తవ్యం బోధించింది. అలాగే ఆ సోదరీమణులిద్దరూ ఆశ్రమాన్ని ఆశ్రయించుకొని అనితరసాధ్యమైన గురుసేవ, ఆశ్రమసేవ, గురుభక్తుల సేవ చేసుకొన్నారు. ఏ పర్వదినమైనా ఆ పండుగకు సంబంధించిన విశేషాలను మృదుమధురంగా వివరించే ఇందిరక్క ప్రసంగం తప్పనిసరి.

ధ్యానం, పారాయణ, జపం ఇత్యాదివి ఎలా చేయాలో నేర్చుకోవాలనుకొనే వారికి ఇందిరక్క ఒక ప్రతీకగా నిలుస్తారు. ఆమె ధ్యానంలో సాధించిన ఏకాగ్రతకు మెచ్చి శ్రీగురుదేవులు ఆమెకు 'సుషుమ్న' అనే నామధేయాన్ని అనుగ్రహించారు. తరువాతి కాలంలో ఆమె 'సుషుమ్నా ప్రసాద'గా భక్తులందరికీ చిరపరిచితులయ్యారు.

సమర్థ సద్గురు మాసపత్రిక సంపాదక వర్గంలో ప్రముఖ పాత్ర పోషించడమే కాక తెలుగులో, ఆంగ్లంలో అనేక వ్యాసాలను రచించి పత్రికకు అందించారు, గ్రంథాలుగా  ప్రచురించారు. అంతేగాక శ్రీమాతాజీ వారి సహస్రనామాలను, అష్టోత్తర శతనామాలను రచించారు.

అలా నిరంతర సాధనలో తమ నిండు జీవితాన్ని పండించుకొని 85 వసంతాలు పూర్తి చేసుకొని బ్రాహ్మీ ముహూర్తంలో స్నానాదికాలు ముగించుకొని, తమ నిత్యానుష్ఠానానికి సిద్ధమై కుర్చీలో కూర్చొని 'అక్కా నేను దేవుడి దగ్గరకు వెళ్ళిపోతున్నాను' అని చెప్పి గురుచంద్రుని కనులనిండా నింపుకొని (ఇందిర అంటే నీలికలువ. కలువలు చంద్రోదయంతోనే వికసిస్తాయి) ఆ గురుదేవునిలోనే ఐక్యమైపోయారు. శ్రీ సుషుమ్నా ప్రసాద వారి వంటి పరమ భక్తులు చూపిన మార్గంలో పయనిస్తూ, నిరంతర సాధన, సేవ చేసుకుంటూ గురుసాయుజ్యాన్ని పొందే మార్గంలో సాధన చేయడమే మనం వారికి అర్పించే ఘననివాళి.

# సుబోధ

సేకరణ- కీ.శే. జానకిరామ శాస్త్రి

భక్తుడు :- భగవంతుని పట్ల ఎంతో భక్తి శ్రద్ధలు కలిగినప్పటికీ కష్టాలను ఎందుకు అనుభవించాల్సి వస్తుంది?

శ్రీ రామకృష్ణులు:- దేహాన్ని ధరించినప్పుడు సుఖదుఃఖాలు అనివార్యాలు. కవి కంకణ్ రచించిన చండీ గ్రంధంలో కాలువీర్‌ను చెరసాలలో బంధించి అతడి ఛాతీ మీద పెద్ద బండరాయిని పెట్టినట్లుగా వ్రాసి ఉంది. జగన్మాత వరప్రసాదుడైన కాలువీర్‌కు ఇలా జరిగింది.

శ్రీమంతుడనే మహా భక్తుడు ఎన్నో కష్టాలను అనుభవించాడు. అతడి కష్టాలకు అంతేలేదు. దాదాపుగా అతడి తల నరికినంత పనైంది.

జగన్మాత ప్రియతమ భక్తుడొకడు కట్టెలుకొట్టి, అమ్ముకొని, జీవించాల్సి వచ్చింది. అతడికి జగన్మాత సాక్షాత్కారమైనప్పటికీ, అతడు జీవనోపాధికై కట్టెలు కొట్టి అమ్ముకునే కఠోర జీవితాన్నే కొనసాగించాడు.

కారాగారంలో ఉన్న దేవకీదేవికి శంఖుచక్రగదాపద్మధారి అయిన శ్రీ మహావిష్ణువు దర్శనం కలిగింది. అయినప్పటికీ ఆమెకు కారాగార విముక్తి కలుగలేదు.

ప్రారబ్ధకర్మ ఫలాన్ని అనుభవించి తీరవలసిందే. పూర్వకర్మలు పూర్తిగా తీరేటంత వరకూ దేహం ఉండే తీరుతుంది. ఒకప్పుడు అంధుడొకడు గంగలో స్నానం చేశాడు. తత్ఫలితంగా అతడి పాపాలు నశించాయి. కానీ అతడి అంధత్వం మాత్రం అలాగే ఉండి పోయింది. పూర్వజన్మలో చేసిన పాపకృత్యాల కారణంగా అతడు అంధత్వం అనుభవించవలసి వచ్చింది. సాక్షాత్తూ శ్రీకృష్ణుడు పాండవులకు అండగా ఉన్నప్పటికీ వారు అంతులేని కష్టాలను అనుభవించినా వారు భగవచ్చింతనను వీడలేదు.

భక్తుడు శారీరక సుఖదుఃఖాలను ఎంతగా అనుభవిస్తున్నప్పటికీ అతడు భక్తి జ్ఞానాలనే నిధిని కలిగి ఉంటాడు. ఈనిధి అతణ్ణి ఎన్నటికీ వీడదు.

# శ్రీ గురుగీతా

(గత సంచిక తరువాయి) -కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

## అథ ప్రథమోధ్యాయః

ఋషయ ఊచు:- (ఋషులచే అడుగబడినది)

**సూత! సూత! మహాప్రాజ్ఞ! నిగమాగమ పారగ!**

**గురు స్వరూప మస్మాకం బ్రూహి సర్వమలాపహమ్ 2**

**<u>పదవిభాగము</u>** :-

సూత - సూత! మహా ప్రాజ్ఞ -నిగమ-ఆగమ-పారగ-

గురు స్వరూపం - అస్మాకం-బ్రూహి-సర్వమల-అపహమ్.

**<u>టీక</u>** :- మహాప్రాజ్ఞ = గొప్ప ప్రజ్ఞావంతుడవగు; సూత, సూత! = హే సూతమహర్షీ; నిగమ = (పదార్థ కథనేన వేదార్థచోదకే గ్రంథ విశేషే) పర్యాయపదములను దెలిపి వేదార్థములను తెలిపే గ్రంథ విషయమునను; ఆగమ=శబ్ద జన్యమైన జ్ఞాన విషయమునను; పారగ= అంతము (చివర వరకు) చూచిన వాడా! అస్మాకం = మాకు; సర్వమల= సర్వపాపములను అపహమ్: నశింపచేయు, పోగొట్టు; గురు స్వరూపం = గురు స్వరూపమును గూర్చి; బ్రూహి = చెప్పుము.

**<u>వ్యాఖ్య</u>** :- ఒకానొక సందర్భమున శౌనకాది మహర్షులు సూత మహర్షిని "ఓ మహాప్రాజ్ఞుడవైన సూతమహర్షీ! నీవు నిగమాలనూ, ఆగమాలనూ పారముముట్టగా తెలుసుకొన్నవాడవు. అందుచేత మాకు దయతో సర్వమలాపహమైన గురుస్వరూపమును గురించి తెలియజేయు"మని ప్రార్థించిరి.

సూతుడు అంటే క్షత్రియ (రాజస) బ్రాహ్మణ (సాత్విక) లక్షణములు గలవాడు. వృత్తి చేత రథ చోదకుడు. పురాణ కర్తయైన వ్యాసుడు సూతుని రజోగుణము ప్రధానంగాను, సత్వగుణము ఎక్కువగాను కలిగి, కేవల శరీరధారణ మాత్రానికి పరిమితమైన తమోగుణం కలవానిగా వర్ణిస్తున్నాడు. పట్టుదలతో నిగమములనూ, ఆగమములనూ, సమస్త పురాణ

సంచయమునూ, ఆపోసన పట్టిన దిట్ట సూతుడు. అంతేకాదు అతడు శరీరమనే రథాన్ని (శరీరాన్ని రథంతో పోల్చుటం ఉపనిషత్ప్రసిద్ధము) చక్కగా నడుప నేర్చిన వాడు గనుక అతడు మహాప్రాజ్ఞుడు. "జ్ఞ" అంటే "జ్ఞానము", "చైతన్యము" కనుక, సూతుడు ప్రకృష్టమైన జ్ఞానం కలవాడు గనుక తమకు "సర్వమలాన్నీ" పోగొట్టే ఉపాయం చెప్పమన్నారు.

వేదాంత శాస్త్రంలో మల, విక్షేప, ఆవరణలు ఆత్మ సాక్షాత్కారానికి అడ్డునిల్చే విఘ్న కారకములు. 'మలము' అనగా (మురికి) పాపము. ఈ పాపము తొలగి విక్షేపమనే చిత్తచాంచల్యము తొలగిన తరువాత కాని గురుదేవుడి ద్వారా శిష్యుడి అజ్ఞానావరణ భంగం కలుగదు. అందుచేత శౌనకాదులు ప్రాజ్ఞుడైన సూతుని మలాపహ మార్గమును తెలియజేయమని కోరుతున్నారు. అంతేకాదు, యింకా యిలా అడుగుతున్నారు:

**యస్య శ్రవణమాత్రేణ దేహీ దుఃఖాద్విముచ్యతే**
**యేన మార్గేణ మునయః సర్వజ్ఞత్వం ప్రపేదిరే ॥ 3.**
**యత్ప్రాప్య న పునర్యాతి నరస్సంసార బంధనమ్**
**తథావిధం పరంతత్త్వం వక్తవ్య మధునాత్వయా ॥ 4.**
**గుహ్యాత్ గుహ్యతమం సారం గురుగీతా విశేషతః**
**త్వత్ ప్రసాదాచ్చ శ్రోతవ్యా తత్సర్వం బ్రూహి సూత నః 5.**

\- సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రితాశ్రమ నివాసస్థులు అయిన శ్రీ చిలువూరి సూర్యనారాయణరాజు (హృషీకేశ్ రాజు) గారు 11-9-2024 బుధవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 93 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీబుల్లిమామయ్య తెలిపిన శ్రీబాబు లీలలు

(గత సంచిక తరువాయి) - కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

10. రాజమండ్రి జయంత్యుత్సవాలలోనే ఒక రోజు శ్రీ బాబు తమ బోధామృతాన్ని అందించే సమయంలో, ఒకతను ఫోటోలు తియ్యటం మొదలు పెట్టాడు. శ్రీబాబు "వద్దు నాయనా! కూర్చో! నువ్వు అందరికి అడ్డుగా ఉన్నావు" అన్నారు. రెండు మూడు సార్లు అతను మళ్ళీ ఫోటోలు తీయటం, శ్రీ బాబు వద్దని చెప్పటం జరిగింది. కాని అతను మానలేదు. తమ సంభాషణ ముగించిన



తరువాత శ్రీ బాబు ఆ ఫోటోలు తీసిన వానితో "పాపం యిందాకటి నుంచి నేను వద్దంటున్నా వినక చాలా కష్టపడి చాలా ఫోటోలు తీశావు. కాని ఏం చేస్తాం. అందులో ఒక్కటి కూడా రాలేదు. పోనీలే. ఇంకా రీలులో మూడు ఫోటోలకు ఖాళీ ఉంది. తీసుకో నాయనా! అవి బాగానే వస్తాయిలే" అని అవకాశమిచ్చారు. తరువాత చూస్తే శ్రీ బాబు చెప్పినట్లు ఆ మూడు ఫోటోలు మాత్రమే బాగా వచ్చాయి. మిగిలినవన్నీ తెల్లగా ఉన్నాయి.

11. బుల్లి మామయ్య గారికి ఒక యెడ్ల జత ఉండేది. అవి మంచి చురుకైన యెడ్లని వడాలిలో వాటికి బాగా పేరున్నది. శ్రీ బాబు ఒకసారి వడాలి వచ్చినప్పుడు, బుల్లి మామయ్య గారింటి బయట అరుగు మీద కూర్చుని ఉన్నారు. ఆ సమయంలో ఒక పుట్టెడు వడ్ల బస్తాలు బండి మీద వేసుకుని ఆ యెడ్ల జతను బండికి కట్టి తోలుకుని

వస్తున్నారు. అప్పటిలో రోడ్డు లేదు. మట్టి రోడ్డు మీదనే బండి వస్తున్నది. బుల్లి మామయ్యగారింటి దగ్గరకు బండి వచ్చేసరికి, ఆ యెడ్ల జతలో ఒకటి శ్రీ బాబును చూసి, ఖణేల్ మని రంకె వేసి, మట్టిలోనే బండిని యింటి వైపు లాక్కొని వచ్చి శ్రీబాబు కెదురుగా చూస్తూ నిలబడిపోయింది. శ్రీ బాబు దాని తలపై చేయి వేసి, గంగడోలును నిమురుతూ "దీనిని కళ్యాణి అని పిలవండి. ఈ ఎద్దును కట్టి యే చేనులో వ్యవసాయం చేస్తారో ఆ చేను రాశులు పండిస్తుంది" అన్నారు. జీవకోటిలో ప్రతి జీవి ఆ ప్రభువు కృపకు పాత్రమైనదే. కాని ఆ ఎద్దు పూర్వ పుణ్యమెంతటిదో స్వామికే తెలుసు.

12. ఆశ్రమం కోసం నంబూరు దగ్గర ఉన్న స్థలం చూడటానికి, శ్రీ బాబుతో బాటు నిండ్రకొలను డాక్టరుగారు, పాండుగారు, బంగారురాజుగారు (నిండ్రకొలను భక్తులు) మరికొందరు కూడా వచ్చారు. శ్రీ బాబు కూర్చోటానికి ఉపయోగపడుతుందని బంగారురాజుగారు ఒక చాప చుట్టి చంకలో పెట్టుకుని తెచ్చారు. శ్రీ బాబు "అదేమిటి బంగారురాజుగారూ? చాప తెచ్చుకున్నారేమిటి? ఇంకా నయం. చెంబు కూడా తెచ్చుకున్నారేమోనని హడలిపోయాను" అన్నారు. కాస్త వీలుగా ఉన్న చోట బంగారు రాజుగారు చాప వేశారు. శ్రీ బాబు, వారితో బాటు మిగతావారు కూడా కూర్చున్నారు. అది 12 1/2 ఎకరాల మామిడి తోట. ఎంతో ప్రశాంతంగా, తపోవనం లాగానే ఉంది. కాని ఎన్నో పుట్టలు!

- సశేషం

విష్ణు  కథలు

(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

# చైతన్య మహాప్రభువు

ఇరువురి మధ్య చాలాసేపు చర్చలు జరిగాయి. గోవధ నిషేదించవలసిన అవసరం గురించి ఖాజీకు తెలియచేశారు. “గోక్షీరాలను త్రాగటం చేత గోవు మానవులకు మాతృమూర్తి అని, భూమిని దున్ని ధాన్యము అందించే ఎద్దు తండ్రి అని వాటిని చంపి వాటి మాంసాన్ని తినటం ఘోరపాపం” అని తెలియజేశారు. అంత ఖాజీ “మా మత గ్రంథమైన ఖురాను ప్రకారం రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి భోగానుభవం, రెండోది భోగత్యాగం. మొదటి మార్గం అనుసరించేవారు మాంస భక్షణ చేయవచ్చును. వారికి గోవధ అనివార్యం. అంతేకాదు మీ వేద సాంప్రదాయంలో కూడా యజ్ఞయాగాది క్రతువులలో జంతుబలి చేయుటం ఆచారమై వున్నది కదా!” అన్నాడు. అంత చైతన్యులవారు “వేదం గోవధ నిషేధిస్తుంది. యజ్ఞయాగాదులలో జంతుబలి ఉన్న మాట నిజమే. చిక్కి శల్యమైన వృద్ధ జంతువులను బలి ఇస్తారు” అని చెప్పాడు. చైతన్యుల వారి ప్రబోధంతో ఖాజీ ప్రభావితుడైయ్యాడు. చైతన్యుల సంకీర్తన ఉద్యమంలో సభ్యుడై శ్రీ కృష్ణ భక్తుడయ్యాడు.



చైతన్యులవారి శిష్యులలో వాసుదేవుడనే వాడు ఉన్నాడు. ఒకసారి, వాసుదేవుని ఇంట్లో చైతన్యుడు ఆశీనుడై శ్రీకృష్ణుడు మధురాపురంలో కొలువుతీరి ఉన్న దృశ్యాన్ని చూపించాడు. చైతన్యులవారు ప్రదర్శించిన ఈ మహిమ నగరవాసులకు తెలిసి, చైతన్యులు సాక్షాత్ శ్రీకృష్ణ భగవానుడే అని కీర్తించారు.

వాసుదేవుని ఇంట్లో సంకీర్తన జరుగుతోంది. అదే సమయానికి వాసుదేవుని కుమారుడు మరణించాడు. ఈ వార్త శ్రీ చైతన్యులకు తెలిస్తే సంకీర్తన ఆగిపోతుందని ఆ సంఘటన తెలియనీయక మనస్సు సంకీర్తనపై లగ్నంచేసి భక్తుల మధ్య కూర్చుని ఉన్నాడు.

చైతన్యులవారి మనస్సు ఎందుకో సంకీర్తనపై లగ్నం కాలేదు. చైతన్యులు "వాసుదేవా! ఈ నాడు ఎందుకో సంకీర్తనలో నా మనస్సు రమించటం లేదు. కారణం ఏమిటో నీకు తెలిస్తే చెప్పు" అన్నారు "స్వామీ నా కుమారుడు ఆకస్మిక మరణానికి గురి అయినాడు" అన్నాడు వాసుదేవుడు.

చైతన్యులు ఆశ్చర్య చకితులై, "వాసుదేవా! నువ్వు ధన్యుడివి. పుత్ర వియోగ దుఃఖానికి పాల్పడక మనస్సు హరినామ స్మరణపై లగ్నంచేశావు. దారాపుత్రాదులు జల ప్రతిబింబాలు. నారాయణుని సేవలోనే మనస్సుకు శాంతి లభిస్తుంది. పుత్రుని మరణం నీ హృదయంలోని కృష్ణభక్తిని కదలించలేక పోయింది. నీవు పుణ్యాత్ముడవు" అని కంట నీరు పెట్టారు చైతన్యులు.

వాసుదేవుడు "స్వామీ! నా పుత్రుడు ధన్యాత్ముడు. అంతటి భాగ్యశాలి మరొకడు ఉండడు. మీరు సంకీర్తన చేసే సమయంలో అతడు దేహాన్ని త్యజించాడు" అన్నాడు. చైతన్యుడు వాసుదేవునితో తన కుమారుని మృత కళేబరాన్ని తీసుకు రమ్మన్నాడు. చైతన్యులు ఆ బిడ్డచేత మాట్లాడించారు. అంత ఆ బిడ్డడు "స్వామీ! నేను ఉత్తమ లోకాలకు పోవుచున్నాను. నా గమనమును నిరోధించవద్ద"ని చైతన్యులను ప్రార్థించాడు. ఆ పసివాని భక్తి ప్రభావానికి చైతన్యులు విస్మయం చెందారు.

ఇలా కొంతకాలం గడిచిన తరువాత చైతన్యులు సదా శ్రీకృష్ణ చైతన్యంలో రమించసాగారు. శ్రీ కృష్ణ ధ్యానమగ్నుడై, చైతన్యులు సన్యాస దీక్ష స్వీకరించి "శ్రీ చైతన్య" నామంతో పిలువబడ్డాడు.

- సశేషం

# శ్రీ కాళీ వనాశ్రమ శాఖ, భీమవరము, పశ్చిమ గోదావరి జిల్లా (ఆం.ప్ర)

### శ్రీగురుదేవుల ప్రతిష్ఠా మహోత్సవం

శ్రీగురుదేవుల ప్రతిష్ఠా మహోత్సవం - భీమవరం పట్టణములో శ్రీగురుదేవుల బృందావన నిర్మాణము త్వరితగతిన జరుగుతున్న విషయం భక్తులందరికీ తెలిసినదే. వచ్చే మాఘమాసము నాటికి పూర్తి కాగలదని ఆశిస్తున్నాము. ప్రతిష్ఠామూర్తులు కూడా తయారవుచున్నవి. అందువలన దైవజ్ఞులచే ప్రతిష్ఠా ముహూర్తము నిర్ణయించబడినది.



ది.12.03.2025 బుధవారము ఉ.10.42 గం.లకు గృహప్రవేశము, అనంతరం యాగశాలా ప్రవేశము, మండపారాధనలు, అఖండ హరినామ సంకీర్తన ప్రారంభము. ది.13.03.2025 నుండి యాగము, అధివాసములు, సాధుమహాత్ముల ప్రవచనములు. ది.17.03.2025 సోమవారము ఉ.10.22 గం.లకు శ్రీ గురుదేవుల అభయ క్షీర శిలామూర్తి ప్రతిష్ఠ జరుగును.

భక్తులందరూ ఈ కార్యక్రములో పాల్గొనవలసినదిగా ఆహ్వానిస్తున్నాము. భవన నిర్మాణమునకు ఇప్పటికే కొంతమంది భక్తులు తమ సహాయం అందించారు. నిర్మాణమునకు అవసరమైన నిధులు ఇంకా సమకూరలేదు. ఉదార హృదయులైన భక్తులందరూ యథాశక్తి తమ సహాయ సహకారములు అందించ వలసినదిగా ప్రార్థిస్తున్నాము.

ముఖ్యవిషయం: ప్రతిష్ఠానంతరం బృందావనంలో నిత్యసేవకు నెలకు ఇద్దరు చొప్పున 12 నెలలకు అవసరం ఉంటుంది. నిత్యసేవ చేసుకునే ఆసక్తిగల భక్తులు ముందుగానే తమ పేర్లు నమోదు చేసుకొనవలసినదిగా ప్రార్థన. జైగురుదేవ్.

భక్తులు యిచ్చు విరాళములకు ఐ.టి. యాక్ట్ 80జి క్రింద పన్నురాయితీ లభించును. విరాళములు ఈ క్రిందిబ్యాంక్ ఎకౌంటుకు పంపవలెను.

Sri SriSri Hanumath Kali Vara Prasad Babu Trust
Bank of Baroda, Bhimavaram Branch
SB Account No.69900 1000 00 172
IFSCode: BARB0BHIMAV

మరింత సమాచారము కొరకు:

మురళీ - 93983 34345

తుమలపల్లి శివ: 96181 99556

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

శ్రావణ పౌర్ణమి నాడు శ్రీ సద్గురు పాదపూజ









ఆగష్టు 3 నుండి 6, 2024 వరకు అంబాజీపేట గ్రామములో జరిగిన సామూహిక పూజలు మరియు సత్సంగ కార్యక్రమ దృశ్యములు

REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on Fifth and Sixth of every month

RNI No. 37804/81
POSTAL REGD. No. : GTR/27/2024-26

## ఆగష్టు 19 నుండి 22, 2024 వరకు గుంటూరు జిల్లా కట్టమూరు గ్రామంలో జరిగిన శ్రీ మాతాజీవారి సత్సంగ కార్యక్రమ దృశ్యములు







If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.